# వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 03 సెప్టెంబర్ 2024


ప్రజా సమస్యల పరిష్కారానికి

## ప్రజాదర్బార్

- తెల్లవారకముందే మంత్రి ఇంటిముంగిట క్యూ కట్టిన ప్రజలు

- బాధితులను చిరునవ్వుతో పలకరించి అర్జీలు స్వీకరించిన మంత్రి



**చిన్నమండెం, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త :**

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లె గ్రామంలోని తమ నివాసం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ ఆక్రమణలు ఎక్కువగా జరిగాయని దీంతో జిల్లాలోని ప్రజలు భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చిన భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో తరచూ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి తెల్లవారకముందే మంత్రి ఇంటి ముంగిట ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి క్యూ కట్టారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను మంత్రి చిరునవ్వుతో పలకరించి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నీ తక్షణమే పరిష్కరించాలని, అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలియజేయడం జరిగింది.

## ఎప్పటికప్పుడు సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- ఎ అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధి దాటరాదు

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాయచోటి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీను పరిష్కరించడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదు. నాణ్యతే ప్రామానికంగా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్వో సత్యనారాయణరావు, ఎసీడసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్ధిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) తరచుగా తమ శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు వస్తాయి, దాని పరిష్కారానికి తీసుకోవాల్సి న చర్యలు ఏమిటి, అది ఏ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉంది, దరఖాస్తుదారులతో మాట్లాడాలి, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. ఇందుకు నిర్ధిష్ట కాల పరమితి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఒక వేళ కోర్టు పరిదిలో ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకోవడం చేయాలి. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలి. పెండింగ్ దరఖాస్తులు రీ ఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సీఎం మరియు ఉప ముఖ్యమంత్రి లాగిన్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

### ప్రజల నుంచి అందిన కొన్ని విజ్ఞప్తులు

రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామం కొత్త హరిజనవాడకు చెందిన భాగ్యమ్మ గతంలో నాకు కరోనాతో పాటు బ్లాక్ ఫంగస్ కూడా వచ్చింది. దీనికి డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకొని మందులు వాడుతున్నారు. పేదరాలినైన నా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. మందులు ఖర్చు భరించలేకున్నా. నాపై దయ ఉంచి పింఛను మంజూరు చేయించాలని కలెక్టరుకు అర్జీ సమర్పించారు. పీలేరు మండలంలో నల్లగుట్ట యందు నివసించే స్వాతి.. నేను పక్షవాతంతో బాధపడుతున్నాను. గతంలో నాకు ఇచ్చిన ఆధార్ కార్డు కాలిపోయింది. ప్రస్తుతం నాకు ఆధార్ కార్డును మరియు పింఛను మంజూరు చేయాల్సిందిగా విన్నవిస్తూ కలెక్టరుకు అర్జీ ససమరిపంచారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం

: సీమాంక్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుబ్బారెడ్డి

**బద్వేలు అర్బన్ , సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :**



బద్వేలు సీమాంక్ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా కృషిచేస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మాచనూరు సుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వార్త విలేకరితో సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బద్వేలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిలో ప్రతి రోగికి సత్వర వైద్యం అందించేలా కృషిచేస్తానని, ఇందుకు తనకు వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. గతంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన రాంప్రసాద్ పదవి విరమణ పొందడంతో ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుబ్బారెడ్డి కి ఆసుపత్రిలో పలువురు డాక్టర్‌లు, వైద్య సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా బోల్తా పడ్డ ఆటో

**కాశినాయన, సెప్టెంబర్ 02 ప్రభాతవార్త :**

బద్వేలు పట్టణంలోని కోటవీధికి చెందిన వ్యక్తులు సోమవారం కాశినాయన దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఆలయం నుంచి ఒక కిలో మీటర్ దూరంలో ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా, ఒక వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. అంబేద్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు ఆలస్యంగా వచ్చి క్షతగాత్రులను పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఆర్టీసీలో ఖాళీగా ఉన్న షాపులకు

## టెండర్లు దరఖాస్తు చేసుకోండి

**బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 02 ప్రభాతవార్త :**

పట్టణంలో ఆర్టీసీ డిపోలో 14 షాపులు మరియు పోరుమామిళ్ల బస్‌స్టేషన్‌లో 7 అలాగే కలసపాడు బస్ స్టేషన్ లోని ఒక షాపు మొత్తం 22 షాపులకు ఈ నెల 13వ తేది టెండర్లు కోరినట్లు సోమవారం డిపోమేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి టెండర్ దరఖాస్తు ఫారాలు బ ద్వేలు డిపో మేనేజర్ కార్యాలయంతో పాటు ఇతర డిపోలలో పనివేళలలో ఈ నెల 12వ తేది వరకు అమ్మనున్నట్లు తెలిపారు. వీటివిలువ బద్వేలు డిపోనందు రూ.885లు కాగా, పోరుమామిళ్ల, కలసపాడులలో 295లుగా నిర్ణయించారు. దరఖాస్తు చేసిన ఫారాలను 13వ తేది మధ్యాహ్నం 2 గంటలలోపు కడపలోని జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని అదేరోజు సాయంత్రం టెండరు దారుల సమక్షంలో వాటిని తెరవనున్నట్లు తెలిపారు. టెండరు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 9959225779, 9553692209నంబర్లను సంప్రదించాలన్నారు.

## విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

-లైంగిక వేధింపులకు గురైన విద్యార్థినికి మంత్రి వర్యులు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం -బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సస్పెండ్

-రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని తీవ్రంగా శిక్షించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.లక్కిరెడ్డిపల్లె మండలంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని లైంగిక వేధింపులకు గురి కావడంతో బాలయోగి గురుకుల పాఠశాలను సోమవారం రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి వర్యులు రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడడం క్షమించారని నేరమని లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకొని తీవ్రంగా శిక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు.రాష్ట్రంలో ఎక్కడైనా విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లయితే బాధితులు తీవ్ర పరిణమాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. లైంగిక వేధింపులకు గురైన విద్యార్థినికి మంత్రి వర్యులు ప్రభుత్వం తరుపున తన సొంత డబ్బు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు.విద్యార్థిని చదువుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన ఇంతవరకు తమ తృష్టికి రాలేదని ఇలాంటి సంఘటనలు తరిగి పేనారావృతమైతే గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని సస్పెండ్ చేసి ఇంటికి పంపడం జరుగుతుందన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్ భర్త ను లక్కిరెడ్డిపల్లె పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అతనికి కఠినమైన చర్యలు పోలీసులు తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరెంటెంట్, డాక్టర్ సులోచన,ఐ సి డి ఎస్ పద్మావతి, తెదేపా నాయకులు మదన మోహన్, ఆరిపుల్ల, షఫీ నాయక్, అమీర్, మల్లికార్జున, నసీరుద్దీన్, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ లాంటి పాలకులు మళ్లీ రారు

- వైఎస్ఆర్ ఆశయాలు ఒక్కటీ అమలు కావడం లేదు

- వైఎస్ఆర్ 15వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన వైఎస్ షర్మిళ



**వేంపల్లె, సెప్టెంబరు 2, ప్రభాతవార్త ః**

దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నాయకులు మళ్లీ రారని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నది కేవలం ఐదేళ్లు అయినా ఆయన హయాంలో చేసిన అభివృద్ధి మరిచిపోలేనిదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్ ఆర్ సమాధి వద్ద సోమవారం ఆమె నివాళులర్పించారు. వైఎస్ఆర్ సమాధికి పూలమాలలు వేసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ మరణం తరువాత 700మంది చనిపోయారని, వారందరికీ కాంగ్రెస్ పార్టీ నివాళులర్పిస్తోందన్నారు. వైఎస్ఆర్ ఆశయాలు ఒక్కటి కూడా అమలు కావడం లేదన్నారు. వైఎస్ఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా జరిగాయన్నారు. రాష్ట్రం విడిపోయి 10ఏళ్లు గడిచినా అభివృద్ధి లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా లేదన్నారు. వైఎస్ఆర్ మరణం తరువాత జలయజ్ఞం అటకెక్కిందన్నారు. అభివృద్ధిని బాబు, జగన్ నీరు గార్చారని ఆమె విమర్శించారు. జగన్ కడప బిడ్డ అయి ఉండి కూడా ఇక్కడ అభివృద్ధి లేదన్నారు. బీజేపీని వైఎస్ఆర్ వ్యతిరేకిస్తూ జగన్ మాత్రం బీజేపీతో దోస్తీ కట్టారన్నారు. రాష్ట్రంలో వరదలు ఒక అసాధారణ పరిణామం అని, ఇది ఘోర విపత్తు అన్నారు. ఈ విపత్తును ముందే అంచనా వేయలేకపోవడం దారుణం అన్నారు. ఇంత టెక్నాలజీ ఉండి కూడా ఎలా అంచనా వేయలేకపోయారో చంద్రబాబు సమాధానం చెప్పాలని వైఎస్ షర్మిళ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, ఉత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలపై లైంగిక వేధింపుల ఘటన పై అంబేద్కర్ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆకస్మిక తనిఖీ

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

లక్కిరెడ్డిపల్లె లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న బాలికపై లైంగిక వేధింపుల ఘటన పై విచారించేందుకు జిల్లా కలెక్టర్ శ్రీధర్,చామకూరి సోమవారం సాయంత్రం గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని పిల్లలందరితో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సుమారు ముప్పై నిమిషాలకు పైగా ఈ ఘటన మరియు ఇతర విషయాలపై మాట్లాడారు.పిల్లలకు ఏమైనా భయాలు ఉన్నాయా అని అడగగా... ప్రిన్సిపాల్ మరియు ఆమె భర్త వల్ల నేను భయాందోళన కు గురవ్వుతున్నామని పిల్లలు జవాబు ఇవ్వగా దానికి జిల్లా కలెక్టర్ స్పందిస్తు ప్రిన్సిపాల్ పై మరియు ఆమె భర్త పై చట్ట పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని పిల్లలకు తెలిపారు.ప్రిన్సిపాల్ మరియు ప్రిన్సిపాల్ భర్త కాకుండా వేరే ఎవరి వల్లనైనా భయాందోళనకు గురౌవ్‌తున్నారా అని అడడగా .... మిగితా ఎవరి వల్ల భయం లేదని పిల్లలు జవాబు ఇచ్చారు. పాఠశాలలో భోజనం మరియు చదువు గురించి కలెక్టర్ అడడగా....తమకు భోజనం బాగుందని, పాఠాలు బాగా చెబుతున్నారని జిల్లా కలెక్టర్ కు పిల్లలు జవాబు ఇచ్చారు.అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల ప్రిన్సిపాల్ మరియు,ప్రిన్సిపాల్ భర్త పై చట్ట పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని వారికి హామి ఇచ్చారు.అనంతరం లక్కిరెడ్డిపల్లె ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బాలికతో మరియు వారి బంధువులతో మాట్లాడి,వారికి భరోసా కల్పించారు. ఈ తనిఖీ లో రాయచోటి ఆర్డిఓ రంగస్వామి, లక్కిరెడ్డిపల్లె, తాసిల్దార్, పోలీసు శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## దివంగత వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్



**వేంపల్లె, సెప్టెంబరు 2, ప్రభాతవార్త ః**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. సమాధికి పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి, తల్లి వైఎస్ విజయమ్మ, వైఎస్ కుటుంబ సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకరతలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించి

## నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి




**కడప క్రైం, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**

బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్‌క్రైం బారిన పడ్డ బాధితులకు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీసు అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీసు స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట రాముడు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

### నా కుమార్తెను కిడ్నాప్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని చక్రాయపేట మండలం అద్దాలమర్రికి చెందిన అన్నపూర్ణమ్మ తన 2వ కుమార్తె(16)ను కిరణ్ అనే వ్యక్తి తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి గతంలో మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లాడని, తరువాత ఆమెను తీసుకొని వచ్చారు. అప్పట్లో తాను తప్పిపోయిందని చక్రాయపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తరువాత తన కుమార్తెను కడపలోని హోంలో ఉంచారు. తరువాత తమకు అప్పగించారు. తన కుమార్తెను ఇంటికి తీసుకొని వచ్చిన మరుసటి రోజునే మరలా కిరణ్ తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి కిడ్నాప్ చేసుకొని తీసుకొని వెళ్లారు. మరలా ఆచూకీ తెలియరాలేదు. తన కుమార్తెను తమకు అప్పగించి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ వెంకట రాముడు చక్రాయపేట పోలీసులతో మాట్లాడి వెంటనే నిందితుడిపై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని ఆదేశించారు.

## మెక్కలు నాటడం అందరి భాద్యత : సుగవాసి

**వీరబల్లి,సెప్టంబర్ 02, ప్రభాతవవార్త :**



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు తొడ్పడాలని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన టిడిపి మండల నాయకుడు తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి, జనసేన మండల జనసేన అధ్యక్షుడు గుగ్గిళ్ళ వెంకటేశ్‌లతో కలసి మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో మెక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మెక్కల సంరక్షణతోనే మానవ మనుగడ ఉంటుందని కావునా ప్రతి ఒక్కరూ తప్పని సరిగా తన జీవితంలో కనీసం ఒక్క మొక్క అయినా నాటాలన్నారు. ఆద్రప్రదేశ్ మొత్తం పచ్చదనంతో నిండిపోవాలన్నారు. అనంతరం మండల టిడిపి నాయకుడు తాటిగుట్ల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటడం చాలా మంచి ప్రక్రియ అన్నారు. చెట్లు మానవాళి మనుగడకు ఎంతో సహాయ పడగలవని తెలిపారు. అనంతరం అక్కడ విద్యార్థినీలు పాఠశాలలో త్రాగునీటి సమస్య ఉందని అలాగే కాంపౌండ్ వాల్ మరియు పాఠశాలలో కంప్యూటర్స్ లేవని అందువల్ల తమకు కంప్యూటర్ విద్య పట్ల సరైన అవగాహన లేకుండా పోతుందని తెలిపారు. అందుకు స్పందించిన ఆయన వెంటనే పాఠశాల ఆవరణంలోని 3బోర్లను పరిశీలించి నీటి సమస్యకు పరిష్కారం తెలియజేశారు. అనంతరం కాంపౌడ్ వాల్ అన్ని కూడా తయారు చేయిస్తామని తెలిపారు. అనంతరం మండల జనసేన నాయకుడు గుగ్గిళ్ల వెంకటేశ్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో ఆంధ్ర ప్రదేశ్ మెత్తం 25శాతంగా ఉన్న పచ్చదనం నేటితో 50శాతానికి ఎగబాకిందన్నారు. ఈ కార్యక్రమమంలో ఈఓపీఆర్‌డి రామచంద్రా రెడ్డి, ఉపాధి ఏపీఓ నాగరాజు, మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి, టిడిపి నాయకులు పద్మనాభ రెడ్డి, నేతి రమణ, నాగసుబ్బయ్య నాయుడు, రాయ వెంకటరమణ నాయుడు, గుదే నాగార్జున టిడిపి బిసి సెల్ నాయకుడు తుమ్మల రమేస్ బాబు, మాజీ సర్పంచ్ యన్‌పి వెంకటరమణ, రామచంద్ర, గోవిందు, హరి, జయరామిరెడ్డి, విశ్వనాధ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, జయచంద్రా రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు కిషోర్, శేషు, రూప, గోపి, రామకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మెన్ జగిలి ప్రసన్న, పాఠశాల స్పెషలాఫీసర్ దివ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కేంద్రాలు ప్రారంభోత్సవం

**యర్రగుంట్ల, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**




నగర పంచాయితీ శాంతి కాలనీలోని బీసీ హాస్టల్ వీధిలో వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీపుల్స్ కమిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చలమయ్య మాట్లాడుతూ పీపుల్స్ కమ్యూనిటి డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో చెన్నైలోని లెటర్స్ ఇండియా ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో ఈ వయోజన విద్యా కేంద్రాలను, పది నెలల పాటు విద్య కేంద్రంలో జరుగునని, మండలంలోని 15 గ్రామాలలో వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని, వయోజనులందరూ ఉపయోగించుకోవాలని, అక్షరాసులుగా మార్పు చెందాలని వారు అన్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని ప్రముఖ పాస్టర్ నిరీక్షణ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 15మంది ఉపాధ్యాయులకు ప్రయోజన విద్య, పాఠ్య పుస్తకాలు మరియు బ్లాక్ బోర్డులు, పలకలు పంపిణీ చేయడం జరిగిందని అధ్యక్షులు చలమయ్య తెలిపారు.

## సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం




**యర్రగుంట్ల, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

ఏపీ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమించక తప్పదని ఏపీ విద్యుత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి నిలుపుకోలేదని అన్నారు. తెలంగాణలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేశారని అదే తరహాలో కనీసం ఈ ప్రభుత్వం అయినా ఆంధ్రప్రదేశ్‌లో కూడ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతున్నామని అన్నారు. గతంలో విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులను చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పర్మినెంట్ చేశారని గుర్తు చేశారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు 2022 ఏప్రిల్ నుండి వేతనాలు పెంపుదల చేయాల్సి ఉండగా 2023 ఆగస్టు నుండి వేతనాలు పెంచారని 16మాసాల పిఆర్‌సి అరియర్స్ కూడ చెల్లించాలని, అలాగే ఏపి జెన్‌కోలో కాంట్రాక్ట్ కార్మికుల్లో అనేక మంది ఐటిఐ, పట్టుబద్రులు తదితర విద్యార్హతలు ఉన్న ఆన్ స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ఏపీ ట్రాన్స్ కో ఉన్న కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారని కానీ ఏపి జెన్‌కోలో విద్యార్హతలు ఉన్న అన్ స్కిల్డ్‌గా తక్కువ వేతనాలు ఇవ్వడం అన్యాయమని ఆవేదనను వ్యక్తం చేశారు. చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించే విషయములో యాజమాన్యము నుండి ఆశించిన స్పందన లేదన్నారు. కార్మికుల సమస్యల మీద ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మిక నాయకులు జి, చంద్రశేఖర్, వి. గంగయ్య, పుల్లారెడ్డిలు మాట్లాడారు. కార్మికుల సమస్యల మీద ముద్రించిన కరపత్రాలను సమావేశంలో విడుదల చేశారు.

## ఘనంగా 15వ వర్ధంతి వేడుకలు

**యర్రగుంట్ల, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలను ఎంవిఆర్ థర్మల్ కేంద్రంలో నిర్వహించారు. సోమవారం డాక్టర్ ఎంవిఆర్ థర్మల్ ప్రాజెక్ట్ వద్ద వైయస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి వైయస్సార్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ఘన నివాళి అర్పించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీపిపి అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల్లో గొప్ప మహోన్నతమైన వ్యక్తిగా నిలిచిపోయారన్నారు. వైయస్సార్ మరణ వార్త విని వారి అభిమానులు చాలా మంది మృతి చెందారు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు మహేశ్వర్ రెడ్డి, ఉద్యోగులు, వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**యర్రగుంట్ల, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా యర్రగుంట్ల పట్టణంలోని ఐసిఎల్ సిమెంట్ కర్మాగారం వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. జమ్మలమడుగు నియోజకవర్గ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ మాట్లాడుతూ ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకుంటూ ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నామన్నారు. రక్తదానం చేయడం తనకు ఆనందంగా ఉందన్నారు.

## మూడు చెరువులకు నీరు నింపేలా మరమ్మత్తు పనులు చేపట్టాలి

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**



రాజంపేట, పుల్లంపేట మండలాల పరిధిలోని ఊటుకూరు, అనంతసముద్రం, చిన్న చెరువు, వత్తలూరు, రాతి చెరువులకు వర్షం వచ్చినట్లు అయితే నీరు చేరేలా అవసరమైన మరమ్మత్తు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నేతలు రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవిని కలిసి కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పుల్లంగేరు నుంచి వచ్చే కాలువలో పెద్ద ఎత్తున ముల్ల పొదలు పెరిగాయని పేర్కొన్నారు. నూకనపల్లె ఆనకట్ట వద్ద రెగ్యులేటర్ పాడైపోయిందని మరమ్మత్తులు చేయించాలని కోరారు. రానున్న సీజన్‌లో నీటి వనరులకు పనులు చేపట్టినట్లు అయితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు రైతుల సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్య నాయుడు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు సుండు సుధీర్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, పిచ్చిరెడ్డి, మలిశెట్టి సుబ్బరాయుడు, ఎస్‌కే కరీం, స్థానిక సర్పంచ్ నాగినేని నరసింహులు, సాంబశివయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

## వైఎస్‌కు వైసీపీ నేతల ఘన నివాళి

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు రాజంపేటలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పాత బస్టాండ్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి గజమాలతో వైసీపీ నేతలు ఘన నివాళి అర్పించారు. జోహార్.. వైఎస్ఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ పోలా వెంకటరమణారెడ్డి, సరిశెట్టి నవీన్, ఎస్.మునాఫ్, డీలర్ సుబ్బరామిరెడ్డి, వద్దే రమణ, కృష్ణారావు, రెడ్డిమాసి రమేష్ నాయుడు, ఖాదర్ మొహీద్దీన్, దాసరి పెంచలయ్య, పి.విశ్వనాధ్ రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ మర్రి రవి, మైనార్టీ నేత జాహీద్ అలీ, సుబ్బరాజు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చెరగని ముద్ర దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి

**ముద్దనూరు, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

మండలంలోని స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్‌సిపి మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి డాక్టర్ నవజ్యోతి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి గజమాలతో ఘనంగా నివాళులు అర్పించి, మండల పరిధిలోని కోడిగండ్లపల్లె సమీపంలోని యేసు అనాధ ఆశ్రమంలో మానసిక వికలాంగులు, అనాధలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. డాక్టర్ నవజ్యోతి రెడ్డి మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, పేదలకు ఉచిత వైద్యం ఆరోగ్య శ్రీ, 108 సేవలు మరువలేనిదని ఆయన తెలిపారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్ అందించి రైతు బాంధవుడు అని తెలిపారు. కరుణాలయంకి ట్యాబ్లెట్స్, శానిటేషన్‌కు కావలసిన ఫినాయిల్, బ్లీచింగ్‌పొడర్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరమేశ్వర రెడ్డి, తిరుమల రెడ్డి, గోపాల్, కృష్ణయ్య, సూర్య మునిరెడ్డి, వెంకట్, ప్రభాకర్, ప్రతాప్, మునెయ్య, వాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన జగన్‌మోహన్ రాజు

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**



ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు సంబంధిత అధికారులను కోరారు. శ్రీరామ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసి రైతులను ఇబ్బంది పెట్టాలంటే ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. గత 20రోజులుగా జగన్‌మోహన్ రాజు నేతృత్వంలో జరుగుతున్న పనులను పలుచోట్ల విద్యుత్ శాఖ అదకారులు నిర్లక్ష్యం చేశారని రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పనులను పరిశీలించారు. సాలాబాద్ సబ్‌స్టేషన్ వద్ద సమస్య పరిష్కారానికి 48గంటల్లో పరిష్కారం చూపాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీతా ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ఒంటిమిట్ట టీడీపీ నాయకులు శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, చౌడయ్య, బోడిచర్ల శ్రీనివాసులు, మోదుగుల నరసింహులు, శరత్ రెడ్డి, మహేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

## తాళాల భజన పోటీలకు ఆహ్వానం

**ముద్దనూరు, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

మండలంలోని యామవరం గ్రామంలో శ్రీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 9వ తేదిన సోమవారం తాళాల భజన పోటీలకు ఆహ్వానం పలుకుతున్నట్లు యామవరం గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, వినాయక భజన మండలి, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ తాళాల భజన పోటీలలో పాల్గొనే వారు ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తెచ్చుకోవాలని, హార్మోనిస్టు, తంబలిస్టు, ఎవరైనా ఉండవచ్చు కానీ పాట పాడరాదు అన్నారు. మిగతా సభ్యులు ఒకే గ్రామం వారై ఉండవలెనని, ఎవరి వాయిద్యము వారే తెచ్చుకోవాలని, రాగ మార్పిడి, తాళ మార్పిడి ఉండవలెనని, 8 నుండి 12 మంది వరకు సభ్యులకు అనుమతి అన్నారు. ప్రతి బృందం వారు వినాయకునికి సంబంధించిన పాట మొదటి పాటగా తప్పకుండా పాడాలని, ఎంట్రీ ఫీజు రూ.216 అన్నారు. ఒక బృందంలో పాల్గొను సభ్యులు మరొక బృందంలో పాల్గొనరాదని, మద్యం సేవించి భజనలో పాల్గొనరాదని, వాదోప వాదాలకు తావులేదని, రాత్రి 8గంటలకు ఖచ్చితంగా డిప్పు తీయబడునని, 8 గంటలు దాటిన తర్వాత వచ్చే టీములకు అనుమతించబడదు అని అన్నారు. మరిన్ని వివరాలకు 99599 14204, 77802 38412, 93474 71839 అనే నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## పవన్ కళ్యాణ్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు

**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**

జనసేన అధినేత, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు జనసేన పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎల్లటూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. సోమవారం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానికంగా కూటమి నేతలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని శ్రీనివాసరాజు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరికి సహాయం చేసే మనసు జనసేనానిది అని, ఆపదలో ఉంటే ఆదుకోవడమే ఆయనకు తెలిసిన ఏకైక సూత్రం అని అందుకే అందరికి పనికివచ్చేలా మొక్కలు నాటే కార్యక్రమం, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకే శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి పరిశీలించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన సహకారం ఎప్పుడు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సుధాకర్, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, డాక్టర్ పీవీఎన్ రాజు, డాక్టర్ అనీల్, డాక్టర్ నిఖిల్ చక్రవర్తి, డాక్టర్ సుష్మ, రాజంపేట రూరల్, అర్బన్ సీఐలు బీవి రమణ, ఎల్లంరాజు పలువురు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**పెనగలూరు,సెప్టంబర్02,ప్రభాతవవార్త :**

మండలంలోని బస్టాండు కూడలి వద్ద జనసేన నాయకులు యర్రంశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిప్యూటీ సియం కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రైల్వే కోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు దొరికిన ఆణిముత్యం డిప్యూటీ సియం అని కొనియాడారు. ప్రకృతి ప్రేమికుడు అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్ వైపుగా నడిపిస్తున్న నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమమంలో కూటమి నాయకులు గొబ్బూరి హరి, అబ్దుల్ మోషిద్, వెంకటరమణ తండపునాటి రాజేష్, వెంకట్, కాకి శ్రీనివాసఉలు, తాటిబోయిన ధనయ్య, కొత్త భాలక్రిష్ణ, పొగడతోటి హరిబాబు, నాగినేని రాంప్రసాద్ నాయుడు, బాబు నాయుడు, లింగం నరేష్, ఈరి విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మెక్కలు నాటిన నాయకులు

**పెనగలూరు,సెప్టంబర్02,ప్రభాతవవార్త :**

మండలంలోని జనసేన నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ 53వ జన్మదినం సందర్భంగా మండలంలో జనసేన నాయకులు శివ, అబ్దుల్, శివ మోషిద్, ఏనుగుల శివ ఆధ్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు ప్రభాతవార్తతో మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం అనే జనసేన మూల సిద్ధాంతాలలో బాగంగా ప్రకృతి ప్రేమికుడు మరియు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అయిన పవన్ కళ్యాణ్ జన్మదినం రోజున ఇలా మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మొక్కలు నాటడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమమంలో జనసేన నాయకులు ధనయ్య, కాకి శ్రీరాములు, సిద్దివరం హరీష్, గానుగపెంట వెంకటయ్య, సట్టి రమణయ్య, సియ్యల ఓబులేసు, రవి పాల్గొన్నారు.

## జీవిత బీమా సంస్థ అంటేనే ప్రజలకు ధీమా

**జమ్మలమడుగు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**

భారత దేశంలోని ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజమైన జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) అంటేనే ప్రజలకు ఎంతో నమ్మకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎల్‌ఐసీకి సాటి మరే ఇతర జీవిత బీమా సంస్థకు లేదని జమ్మలమడుగు ఎల్‌ఐసీ బ్రాంచ్ సేల్స్ మేనేజర్ ఎన్.వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జీవిత బీమా సంస్థ 68వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ వెంకట కృష్ణారెడ్డిల అధ్యక్షతన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ జీవిత బీమా చేసుకున్న వారికి అకాల మరణం సంభవించినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు అతి తక్కువ కాలంలోనే కుటుంబీకులకు బీమా సొమ్ము అందజేయడం ఎల్‌ఐసీ ముందుంటుందన్నారు. ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుసుధాకర్‌రెడ్డి ఎల్‌ఐసీ భారతదేశంలోని ప్రజలకు అందిస్తున్న విశిష్టత గురించి కొనియాడారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆదినారాయణ ఇతర ఉద్యోగులు తదితరులు ఎల్‌ఐసీ సంస్థ యొక్క సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు వెంకట సుబ్బయ్య, నరసింహులు, ఉద్యోగులు ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.




## ఘనంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**పెద్దమండ్యం సెప్టెంబర్ 2 ప్రభాతవార్త**

పిఠాపురం ఎమ్మెల్యే, ఏపి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం పెద్దమండ్యం మండల జనసైనికులు, టీడిపి, బీజేపి నాయకులు,కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతర శ్రామికుడు, కార్మికుడు, బడుగు బలహీనవర్గాల ఆశాకిరణం పేదలపాలిట పెన్నిది, క్లీన్అండ్‌గ్రీన్ ఉద్యమ కార్మికుడు పవన్‌కళ్యాణ్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పవన్‌కళ్యాణ్ న్యాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జనసైనికులు పేదలకుపాలు పండ్లుపంచి పెట్టి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగూరి అష్రాప్, నాగూర్‌వల్లి, చెన్నూరి దనాంజనేయ, ప్రకాష్‌రెడ్డి, ప్రదీప్ కె,పెద్దరెడ్డెప్ప, కూటమినాయకులు, మహుమ్మద్‌ఫారూక్, చిన్నరెడ్డిబాషా, హర్షా, తిమ్మయ్య, చలపతి, నారాశ్రీనివాసులు, రాజు, రెడ్డిబాషా, మౌలా చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శి జనార్దన్ ధాతృత్వం



**పెద్దమండ్యం సెప్టెంబర్ 2 ప్రభాతవార్త**

మండలంలోని పాపేపల్లె కార్యదర్శి జనార్దన్ పాపేపల్లెకు చెందిన పెంక్షన్ లబ్దిదారులు తిరుపతి రమాదేవి మల్టీస్పెషాలిట ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వెంకటరమణ, వెంకటనారాయనలకు తనస్వంత ఖర్చుతో వారి పరిస్థితిని గుర్తించి తిరుపతి ఆసుపత్రికి వెళ్ళి వారికిపెంక్షన్ ఇచ్చి తన ధాతత్వాని చాటుకోవడంతో గ్రామంలో మండలంలో కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మనిషికి మానవత్వం, సహాయం చేయాలన్న మనసుండాలన్నారు. ఇలాంటి వారిక భగవంతుని కృప ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్ఆర్

**గాలివీడు, సెప్టెంబర్ 2(ప్రభాతవార్త):**



బడుగు బలహీన వర్గాల జీవితాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వైసీపీ మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి అన్నారు. సోమవారం గాలివీడు బస్టాండు ఆవరణంలో వైఎస్ఆర్ 15వ వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితో వైఎస్ ప్రజల మనసులో చిరస్మరణీయంగా నిలిచిపోయారని కొనియాడారు. తండ్రికి తగ్గ తనయుడుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తనదైన శైలిలో సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ యువ నాయకులు నిజాముద్దీన్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కలికిరిలో ఘనంగా దివంగత సీఎం వర్ధంతి వేడుకలు

**కలికిరి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**

కలికిరిలో రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కలికిరా ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు డా.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్, వైసీపీ సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, కలికిరి మండలం వైసీపీ నాయకులు రమేష్‌కుమార్, పారపట్ల మహేంద్రరెడ్డి, మహల్ ప్రదీప్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు బంజరు భూములు పట్టాలు ఇవ్వాలి

**ఓబులవారిపల్లె, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలంలో ఉన్న బాలిరెడ్డిగారిపల్లి శివాజీనగర్ తదితర పంచాయతీలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రేషన్ కార్డులు అర్హులైన వారికి పెన్షన్లు పేదలకు ప్రభుత్వ భూములు పంచి ఇవ్వాలని సీపీఐ నాయకులు జ్యోతి చిన్నయ్య, నాగమ్మ, నాగేశ్వరరావు తదితరులు ఓబులవారిపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం నిరసనలు వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు పీర్‌మున్నీ అధికారుల దృష్టికి రాజకీయ నాయకుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి సానుకూలంగా సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వెంకటరమణ, మనీ, శివయ్య పాల్గొన్నారు.

## సిగరెట్లు, బీడీలు, గుట్కాలు మాదకద్రవ్యాలు కాల్చివేత

**చక్రాయపేట, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**



శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము, గండి క్షేత్రము, చక్రాయపేట మండలము వైయస్సార్ కడప జిల్లా సదురు దేవస్థానందు షాపింగ్ కాంప్లెక్స్ నందు వ్యాపరములు నిర్వహించుకొనుచున్న షాపు యాజమానులకు మరియు హోటలు నిర్వాహకులకు వారి షాపుల యందు హోటల్స్ యందు బీడీలు, సిగిరెట్లు, గుట్కాలు మరియు ఇతర మత్తు పదార్థములు/పానీయములు విక్షయించరాదు, సేవించరాదని, హోటల్స్ నిర్వహకులు హోటల్స్ నందు మాంసహారము భుచించరాదని అదే విధంగా హోటల్స్ నందు రేట్లు వివరములను దేవస్థానము అధికారులచే అనుమతి పొంది సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేసుకొనవలేనని కోరుతు 07/08/2024వ తేదీన నోటీసు ద్వారా తెలియపరచడవమైనది. అందులకు షాపు యజమానులు శ్రావణమాస మహోత్సవములలో భాగంగా 31/08/2024వ తేదీ వరకు మినహాయింపు కల్పించవలసినిదిగా కోరడము జరిగినది. 01/09/2024వ తేదీన భక్తాదుల ఇచ్చిన ఫిర్యాదులు మేరకు 02/09/2024వ తేదీన షాపులను తనిఖీ చేయగా షాపుల యందు బీడీలు, సిగిరెట్లు, గుట్కాలు మరియు ఇతర మత్తు పదార్థములు గుర్తించి వాటిని తీసుకొని కాల్చివేయడము జరిగినది. ఇక మీదట గండి క్షేత్రము నందు నిషేధిత బీడులు, సిగిరెట్లు, మత్తు పానీయములు విక్రయించిన మరియు సేవించిన వారిపై తగు చర్యలు తీసుకొనబడునని తెలియజేయడము జరిగినది.

## మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

**చక్రాయపేట, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**



కడప జిల్లా చక్రాయపేట మండలం తాసిల్దార్ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కుప్పం గ్రామం కొండుగారిపల్లి వడ్డీపల్లె రోడ్డు ప్రమాదంలో మృతులకు ఒక్కొక్కరికి ఐదు లక్షల రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ కే రామచంద్రా రెడ్డి గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అత్యంత పేదవారు వెనుకబడిన వద్దె కులము చెందిన కుటుంబాలకు రోడ్డున పడ్డాయి ఎటువంటి జీవన ఆధారం లేని పేదవారి కష్టాలను ప్రభుత్వం అర్థం చేసుకొని వారికి కుటుంబాలకు నష్ట పరిహారం సహాయ చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ ఈ రోజు చక్రాయపేట నుండి ఎమ్మార్వో కార్యాలయం దాకా ర్యాలీగా వెళ్లి కొండుగారిపల్లి వడ్డీపల్లె రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు తక్షణం సాయం చేయవలసిందిగా కోరుతూ తాసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది కావున రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వర్యులు జిల్లా కలెక్టర్ గారు స్పందించి వారికి న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమానికి పాల్గొన్న నాయకులు బిజెపి సీనియర్ లక్ష్మీ రెడ్డి గారు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ జిల్లా వాణిజ్య కమిటీ అధ్యక్షుడు దొంతు సుమన్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు సోము దశరథ రాయల్ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**జమ్మలమడుగు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**

ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం జమ్మలమడుగులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు జమ్మలమడుగు నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ డా.నల్లంశెట్టి నాగార్జున పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జన సైనికులు మరియు అభిమానులు ప్రజలతో కలిసి ర్యాలీ చేశారు.

**CHANGE OF NAME**

I Kulloru Motagatla Kiran Prasantha Kumar S/o Late Kulloru Motagatla Raju D.No.2/19-3, CSI Compound, near new model high school, Kadapa, YSR Kadapa Dist. A.P.-516001. I Have Changed My Name KULURU MOTAKATLA KIRAN PRASANTH KUMAR S/o Late Kuluru Motakatla Raju. Hence forth then Now I may be called as KULURU MOTAKATLA KIRAN PRASANTH KUMAR

# మంత్రిని కలిసిన శ్రీవారి ఆలయ కమిటీ సభ్యులు

- దేవాలయంలో మౌలిక వసతుల కల్పనకై విజ్ఞప్తి



**గాలివీడు, సెప్టెంబర్ 2(ప్రభాతవార్త):**
పెద్దూరు బ్రాహ్మణవీధిలో కొలువైవున్న పురాతన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు క్రీడా, యువజన, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం మంత్రి కార్యాలయంలో కలిసిన కమిటీ సభ్యులు ఆలయంలో భక్తుల సౌకరా ్యర్థం మరుగుదొడ్ల ఏర్పాటు, వివాహం చేసుకునే వధూవరులకు గదు ల నిర్మానం, అర్చకులు, స్వీపర్‌కు వేతనాలు, ధూపదీప నైవేద్యాలకు అవసరమైన ఖర్చులను ప్రభుత్వం నుండి అందేలా చర్యలు తీసుకునేందుకు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా ఈ నెల 5వ తేదీ గాలివీడు లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి పర్యటిస్తున్న దృష్ట్యా ఇరువురి మంత్రు లనూ బ్రాహ్మణవీధి శ్రీవారి ఆలయాన్ని సందర్శించవలసినదిగా కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా దేవాదాయ శాఖ మంత్రితో కలిసి ఆలయాన్ని సందర్శించి ఆలయంలో వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డిరిషికేశ్, హరి కృష్ణ, వీరారెడ్డి, ఆర్యశంకర్, రమేష్, మల్లిఖార్జున, సాయినాథ్‌రెడ్డి తదితరులు

# ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన



**పులివెందుల రూరల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :**
పులివెందుల వాసవిక్లబ్, అవోపా ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కిమ్స్ సవేరా హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో జీఆర్‌బిఎస్, బిపి, ఈసీజీ, 2డి ఎకో, తదితర పరీక్షలు నిర్వహించారు. వాసవిక్లబ్ అధ్యక్షుడు సగళా మహేంద్ర, అవోపా అధ్యక్షుడు, వాసవిక్లబ్ జాయింట్ సెక్రెటరీ మేడం దినేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికు మా ర్, వాసవిక్లబ్ జోనల్ చైర్‌పర్సన్ దిండుకుర్తి నాగభూషణం, అవోపా జిల్లా అధ్యక్షుడు గూడూరు హరి కృష్ణ, అవోపాస్టేట్ సెక్రెటరీ మేడా సాయిబాబా, వనితక్లబ్ అధ్యక్షురాలు పబ్బతి మాధవీలత పాల్గొన్నారు.

# మంత్రి క్యాంప్ కార్యాలయంలో

# ప్రజా దర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన అర్జీదారులు



**రాయచోటి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**
రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం రాయచోటి పట్ట ణంలోని తమ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. గతంలో ప్రజల సమస్యల పరిష్కారం కాక ఎన్నో కష్టా లు, కన్నీళ్లతో కాలం వెల్లదీసిన బాధితులకు రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ బాదితులకు భరోసానిస్తోంది. మంత్రి ఉదయం 6 గంటల నుంచి ప్రజల అర్జీలు స్వీకరించారు. వందల సంఖ్యలో ప్రజలు వస్తున్నప్పటికీ ఏమాత్రం విసిగించుకోకుండా వా రిని చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు వెళ్లారు. దీదీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం జిల్లాల నుంచి కూడా ప్రజా దర్బార్‌కు పలు సమస్యలపై ప్రజలు పోటెత్తారు. వారందరినీ ఆయన ఆప్యాయంగా పలకరిస్తూ అంర్జీలు స్వీకరించారు.

# సమస్యలపై సబ్‌కలెక్టరేట్‌లో అర్జీల వెల్లువ

**మదనపల్లె, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :**



సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాస్పందన కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలను వెల్లువులా విన్నవించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వ రూప్ అర్జీలను ప్రజల నుంచి స్వీకరిం చారు. సుమారు 100అర్జీలకు పైగా ప్ర జలు సమస్యలపై విన్నవించడం జరి గింది. ఎక్కువగా భూ సమస్యలపైన అర్జీలు వచ్చాయి. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలతో పాటు పీలేరు ని యోజకవర్గంలోని కలికిరి, వాల్మీకిపురం మండల ప్రజలు సమస్యలపై విన్నవించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమస్యలు విన్నవించేటప్పుడు ఆధారాలతో కూడిన సమస్యలను విన్నవిం చాలన్నారు. సమస్యను బట్టి అర్జీలపై ఆయాశాఖల అధికారులను ఆదేశించి పరిష్కారానికి చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు.

# వలసపల్లె కాలనీలో అక్రమకట్టడాలు కూల్చివేత

**మదనపల్లె, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :**



రూరల్ మండలంలోని వలసపల్లె కొత్త కాలనీలో ఉన్న అక్రమ నిర్మాణా లను సోమవారం రెవెన్యూ అధికారు లు జేసిబితో కూల్చివేశారు. వలసపల్లె కాలనీలో అక్రమ నిర్మాణాలు పట్టించు కోని రెవెన్యూ అధికారులు అన్న శీర్షిక వార్తలో ప్రచురించిన విషయం తెలి సిందే. స్పందించిన రెవెన్యూ అధికా రులు జేసిబితో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈస దర్భంగా తహశీ ల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేయడమే కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# దేశంలోనే ఎల్‌ఐసీ అగ్రగామి బీమా సంస్థ



**కడప కార్పొరేషన్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**
భారతదేశంలోని అగ్రగామి జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ అని కడప ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనే జర్ జీకేఆర్‌వీ రవికుమార్, మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్‌రాజు, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు కొని యాడారు. ప్రస్తుతం 41 రకాల వ్యక్తిగత బీమా, 12 రకాల సామూహిక బీమా పథకాలు అందిస్తోం దన్నారు. సోమవారం కడప ఎల్‌ఐసీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ గత ఆర్థిక సం వత్సరంలోనే 2.04 కోట్ల వ్యక్తిగత పాలసీల ద్వారా 4.14 కోట్ల మందికి సామూహిక బీమా ద్వారా బీమా రక్షణ అందించామన్నారు. 98.35 శాతం క్లెయింలను చెల్లించి విశ్వసనీయతకు మారుపేరుగా ఎల్ ఐసీ ఒక్క గత ఆర్థిక సంవత్సరంలోనే 19 అవార్డులు గెలుచుకుందన్నారు. గత సంవత్సరం ఎల్‌ఐసీ 7 నూతన పాలసీలు ప్రకటించిందని తెలిపారు. ఎల్‌ఐసీ 2048 బ్రాంచ్, 1584 సాటిలైట్ కార్యాలయాల ద్వారా 14 లక్షల మంది ఏజెంట్లతో, 98వేల మంది ఉద్యోగులతో 74 కస్టమర్ జోన్లతో దేశంలోనూ, అ లాగే 13 దేశాల్లో విదేశీ బీమా కార్యకలాపాలను నిర్వహిస్తోందని వెల్లడించారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఎల్‌ఐసీ రూ.34.78లక్షల కోట్ల మేర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో సోషల్ సెక్టార్లలో పె ట్టుబడులు పెట్టిందని 52.85లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉందన్నారు. కార్యకమంలో ఎల్‌ఐసీ డీవో రఘు నాథరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ సమస్యలపై జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు



**రాయచోటి, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా 30 మండలాల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాల సమస్య లకు సంబంధించిన ఫిర్యాదులపై జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలె క్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ గృహాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయడం జరుగుతోందన్నారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసి న జిల్లా స్థాయి కాల్ సెంటర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు కార్యాలయపు పని వేళల్లో 08561-293086 నంబరును సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శివయ్య, కలెక్టరేట్ ఎస్డీసీ రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, గృహ నిర్మాణాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంపై అవగాహన ర్యాలీ

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 02, ప్రభాతవార్త:**
నేత్ర దాన పక్ష ఉత్సవాల సందర్భంగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కమీషనర్ ఆఫ్ హె ల్త్ అండ్ ఫ్యామిలీ లెల్ఫేర్ ఐఎఎస్ చేపూరి హరికిరణ్ ఆదేశానుసారం జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌సిబి డాక్టర్ సునీల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో కడప జిల్లా అంధత్వ నివారణ సంఘం మేనేజర్ డాక్టర్ సునీత నేతృత్వంలో పట్టణంలో ఆయన ఆధ్వర్యంలో 6 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో రాజీవ్ సర్కిల్ నుండి శివాలయం సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేత్ర దానం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ దేశములో సుమారు 12 లక్షల మంది పూర్తి అంధత్వంతో బాధపడుతున్నారని వారికి తోడు ప్రతి సంవత్సరం 50వేల మంది పెరుగుతున్నారని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సంవత్సరమునకు 50వేలు కార్డియాలు కావాల్సి ఉండే కేవలం 20 నుండి 30వేలు మాత్రమే లక్ష్యం అవుతున్నాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ మరణాంతరం మట్టి, గాలిలో కలిసిపోయే మన నల్లగుడ్డు పొరలు మాత్రమే దానం చేస్తే పూర్తి అం ధత్వంతో బాధపడే అందుల ఇద్దరికి చూపును ప్రసాదించినట్లు అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8వరకు జరిగే నేత్ర దాన పక్ష ఉత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు విరివిగా చేపట్టి అంధత్వాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి చికిత్స అధికారి తేజ, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శోభారాణి, ఎం పీహెచ్ సుబ్బరాయుడు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి

**పీలేరు, సెప్టెంబరు 02 ప్రభాతవార్తః**



ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాని పీలేరు అర్బన్ ఇన్‌చార్జి సీఐ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి అ న్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో వినాయక చవితి కమిటీసభ్యుల సమావేశం ఏర్పాటుచేశా రు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక ఉత్సవ సామూహిక ఉత్స వాలను ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఉత్సవాలను ఉత్సవాలుగా జరుపుకోవాలే కానీ అతిక్రమించి దారిన వెళుతున్న వారిపై రంగులు చల్లడం, కోడిగుడ్లువేయడం, టమోటాలతో కొట్టడం ఇలాంటివి చేస్తే వీడియోల ఆధారంగా కేసులు నమోదుచేస్తామన్నారు. 9వతేదీ నిమజ్జనం ఉంటుంది హై దరాబాదు తరహాలో పీలేరులో కూడా ఆస్థాయిలో ఊరేగింపు ఉత్సవాలు జరుగుతాయని అందుకు తగ్గ ట్టుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుద్ధ్య పరమైన సమస్యలు ఉంటే తమ దష్టికి తీసు కురావాలని ఈవో గురుమోహన్ తెలిపారు. కమిటీ సభ్యులు గురుమోహన్ మాట్లాడుతూ పట్టణంలో 100 విగ్రహాల వరకు ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఉత్సవ విగ్రహాలు కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద కు చేరుకుని అక్కడి నుంచి సీరియల్ నెంబరు కేటాయిస్తామన్నారు. పంచాయతీ మిట్టన హారతి కార్య క్రమం ఉంటుందని ఆయన చెప్పారు. కావున అందరూ బాధ్యత వ్యవహరించాలని కోరారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాబట్టి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలకష్ణ, ఈఓ గురుమోహన్, ఉత్సవ కమిటీ సభ్యులు కె. భాస్కర్‌రెడ్డి, చం ద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్, మోహన్‌రెడ్డి, రాజ,రమణ, కపాల్, సుబ్రమణ్యం, తిరుమల పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం

**పీలేరు,సెప్టెంబరు 02 ప్రభాతవార్తః**



నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో మాజీ సీ ఎం నల్లారి కిరన్‌కుమార్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం మాట్లాడుతూ పార్టీ కో సం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ సీఎం నల్లారి కిరన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో నాయిబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు జనార్ధన్‌రెడ్డి మతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మతుడు జనార్ధన్ ఇం టికి చేరుకుని కుటుంబ సభ్యులు రాజగోపాల్, మురళిలను పరామర్శించారు. నల్లారి అభిమానులు, కార్య కర్తలకు ఏకష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డి, గాంధీపేట రమణ, రామకష్ణ, రాజేంద్రాచారి, మల్లికార్జునరెడ్డి, వెంకటరమణ, రమేష్, పివి.నారాయణ, ఆనంద, యూసఫ్, చంద్రమౌళి, డిష్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లింగోద్భవ మహాశివునికి అన్నాభిషేకం

**పీలేరు, సెప్టెంబరు 02 ప్రభాతవార్తః**




నియోజకవర్గంలోని వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్య సిద్ది అభయాంజనేయస్వామి దేవాల యంలో సోమవారం అమావాస్య సం దర్భంగా జగన్మాత గోముఖ దేవి స మేత శ్రీహరిహర బ్రహ్మ లింగోద్భవ మహాశివ దేవుని సప్తా దాతు, క్షీర, ఏక వార మహారుద్రాభిషేకం నిర్వహిం చారు. షిరిడిసాయి సాలిగ్రామ తిరు ణారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవ స్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యు లు శాస్త్రోక్తంగా మహాశివునికి జలా భిషేకం, పాలాభిషేకం, పసుపు, కుం కుమ, చందనం, విభూది అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంత్రోచ్చారణల నడుమ మహా శివునికి అన్నాభిషేకం, నిర్వహించారు. ఆల యంలో పితదోష నివారణకు హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అదిక సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

# క్రీడాకారులకు చేయూతనందించిన ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

**కడప కార్పొరేషన్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:**



ఈనెల 8వ తేదీ నుంచి 11 వ రకు ఆగ్రాలో జరిగే జూనియర్, సబ్ జూనియర్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి 7 మంది క్రీడాకారులు ఎంపిక కా వడం జరిగింది. క్రీడాకారులు ఫాతిమా, కల్యాణ్, సాయికృష్ణ, తేజ, భరత్ ఖాసీం, మౌనిక నదీ ష్‌లకు రూ.2వేలు ప్రయాణ ఖ ర్చుల కోసం ఉపాధ్యాయ సంఘాల గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసరెడ్డి వితరణ అందించారు. కార్య క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, మధుసూదన్, గంగాధర్, అసోసియేషన్ కార్యదర్శి నాయబ్ రసూల్, సలీం, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**లక్కిరెడ్డిపల్లె,సెప్టెంబర్ 02,ప్రభాతవార్త:**
డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ 53వ జన్మదిన వేడుకలను లక్కిరెడ్డిపల్లె మూడు రోజుల కూ డలి నందు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లి పవన్ కుమార్ రాజంపే ట డాక్టర్ల ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయకులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజల కోసం హరిహన్యాశులకు సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు మరింతగా ముందుకు వెళ్తున్నారన్నారు.

# పేదల గుండెల్లో చెరగని ముద్ర దివంగత సిఎం వైఎస్

**లక్కిరెడ్డిపల్లె,సెప్టెంబర్ 2,ప్రభాతవార్త:**
పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఎం పీపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం రాజశేఖర్ రెడ్డి 15 వర్ధంతి సందర్భంగా మూడు రోజుల కొడేలి నందు వైయస్ విగ్రహానికి పూలమాలయ శ్రీ నివాళులర్పించారు అనంతరం ఆయన మా ట్లాడుతూ వైయస్సార్ ప్రజలలో జరిగిన ముద్ర వేసుకున్నారని ఈ రోజుటికి కూడా వైయస్సార్ ను గుం డెల్లో పెట్టి చూసుకున్నారంటే కారణం 108 ఆరోగ్య శ్రీ వంటి గొప్ప సంక్షేమ పథకాలను తీసుకొని వచ్చిన ఘనత ఒక రాజశేఖర్ రెడ్డి గారి దక్కుతుందని అన్నారు.

# పట్టణంలో ఘనంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

:50 కిలోల భారీ కేక్ కట్‌చేసిన జనసేన నాయకులు : 95 మంది రక్తదానం చేసిన పవన్ అభిమానులు : 200 మొక్కలు నాటిన పవన్ అభిమానులు :2వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం

**బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 02 ప్రభాతవార్త :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొనిదల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్క రించుకుని పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని బలిజ సేవాసంఘం కార్యాలయం వద్ద జనసేన నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం, అన్నదానం చేపట్టి నాలుగురోడ్ల కూడలిలో సుమారు 50 కిలోల భారీ కేక్ కట్ చేయించి , భారీగా బాణాసంచా కాల్చుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జిల్లాను తలపించేలా బద్వేలు పట్టణంలో వైభవంగా నిర్వహించారు. ప్రజల ఆదరా బిమానాలు పొందిన సినీ హీరోగా, డిప్యూటి సీఎంగా పవన్ కళ్యాణ్ అభిమానులు భారీ స్థాయిలో ఉం డడం వలన బద్వేలు పట్టణంలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన జన్మదిన వేడుకలు జిల్లాను తలపించేలా నిర్వహించారు. ప్రొద్దుటూరు, బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో సుమారు 95 మందికి పైగా పవన్ కళ్యాణ్ అభిమానులు రక్తదానాన్ని చేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ జన్మదిన వేడుకలను మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికి తెలిసేలా డీజేసిస్టంతో వాహనం పురవీ ధులలో ఉదయం నుంచి తిరుగుతూ అభిమానులను ఉత్సాహపరిచింది. అలాగే భారీ స్థాయిలో కలిసి జ నసేన నాయకులు పురవీధులలో పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి, రాష్ట్ర అభివృద్ది పవన్‌తోనే సాధ్య మని కొనియాడారు. అలాగే డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు పట్టణంలో సుమారు 200 పైగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బసివి రమేష్, బలిజ సంఘం అధ్యక్షులు దద్దం వెంకటేశ్వర్లు , శింగసాని విజయ్‌కుమార్ (బుజ్జి) , కొర్రపాటి సురేంద్ర, చిన్ని సుబ్బారావు, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, కొము ్రసుబ్బన్న, న్యాయవాది మువ్వా నరసింహులు, గనమంతు రాజేష్, బాసికాల శ్రీను, పెద్ది సుధాకర్, పెరుగువెంకటయ్య, కొంకుల రాంబాబు, రాగి మాను ప్రతాప్‌కుమార్, సాకి ఈశ్వరయ్య, లకిడి విజయభాస్కర్, మస్తాన్‌బాబు, దద్దం నాగార్జున, వెంక



టసుబ్బయ్య ,సూరే ప్రశాంత్, డాక్టర్ గుర్రాల హరిక్రిష్ణ, కుప్పాల మురళి, నానబాల వెంకటేశ్వర్లు, కా లువపలె ్ల సర్పంచ్ శ్రీనివాసులు, కొంకుల రామక్రిష్ణ, అశోక్, రవి, వెంకటరమణ, పీఆర్‌పీ వెంకటసుబ్బ య్య, సాకి ఈశ్వరయ్య, రామాయణపు రామసుబ్బయ్య, గనమంతు నారాయణ స్వామి, పలువురు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. నిరుపేదల ప్రజల పట్ల పవన్ కళ్యాణ్ చూపిస్తున్న ప్రేమ, అభిమానం వెలకట్టలేనిదన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆయన మంచి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



